కల్యాణోత్సవానికి పర్ణశాల ముస్తాబు

- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- గోదావరి లోతుల్లోకి వెళ్లకుండా మెష్
- షామియానాలు.. ప్రసాదం, తలంబ్రాలకు అదనపు కౌంటర్లు



పర్ణశాలలోని రామాలయం

దుమ్ముగూడెం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మండలంలోని పర్ణశాల రామాలయంలో ఈనెల 30న శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామి కల్యాణాన్ని కనులారా చూసేందుకు భక్తులు ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో పర్ణశాలకు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు తగినట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ఆలయం, గాలిగోపురం, ఉపాలయాలు, ప్రహరీ, పంచవటీ కుటీరాలను రంగులతో తీర్చిదిద్దారు. అలాగే, కల్యాణం జరిగే మండపంతో పాటు దేవాలయ ప్రాంగణంలో షామియానాలు వేయగా.. భక్తుల కోసం ప్రసాదాలు సిద్ధ చేస్తున్నారు. కాగా, ఈనెల 29, 30, 31వ తేదీల్లో భక్తులకు స్వామి ప్రత్యేక దర్శనం కల్పించేందుకు టికెట్ ధర రూ.20గా నిర్ణయించారు. అలాగే, భక్తులకు విక్రయించేందుకు దాదాపు 10వేల లడ్డూలను తెప్పిస్తున్నారు. ఇంకా ఆలయ ప్రాంగణంలో జల ప్రసాదం కింద రూ.9లక్షలతో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభించాల్సి ఉంది.

పంచాయతీ ఆధ్వర్యంలో...

పర్ణశాలలో శ్రీరామనవమికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల కోసం సిబ్బందిని నియమించారు. అలాగే, వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని చదునుచేస్తున్నారు. దుమ్ముగూడెం మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 25మందికి మూడు రోజుల పాటు ఇక్కడే రెండు షిఫ్టుల చొప్పున విధులు కేటాయిస్తుండగా, పారిశుధ్య పనుల కోసం దాదాపు 75 మంది కార్మికులను నియమిస్తున్నారు. గ్రామంలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యాన మహిళలు, పురుషులకు వేర్వేరుగా దాదాపు 30 తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేస్తున్నారు. ఇంకా నాలుగు చలివేంద్రాలు, 40 చెత్తా డబ్బాలను ఏర్పాటు చేస్తున్నారు.

స్నాన ఘట్టాలు సిద్ధం

శ్రీరామనవమి వేడుకలకు వచ్చే భక్తులు పవిత్ర గోదావరి నదీ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీ. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కరకట్టలో భాగంగా గోదావరికి అడ్డుగా కాపర్ డ్యాం నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యాన ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యాన ప్రత్యేక స్నానఘట్టాలు ఏర్పాటు చేయడమే కాక గోదావరి లోతు తెలిసేలా అక్కడక్కడ హెచ్చరిక బోర్డులు, జాలీలు ఏర్పాటు చేశారు. అలాగే, మెట్లపై ఉన్న బురదను పంచాయతీ కార్మికులు శుభ్రపరుస్తున్నారు.



గోదావరిలో జాలీ ఏర్పాటుచేస్తున్న కూలీలు



ప్రారంభానికి సిద్ధమైన కూలింగ్ వాటర్ ప్లాంట్

సమన్వయంతో విజయవంతం చేస్తాం



పర్ణశాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు, భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను సిద్ధమయ్యాయి. దేవస్థానం, పంచాయతీ అధికారుల సమన్వయంతో నవమి వేడుకలను విజయవంతం చేస్తాం.

– ముత్యాలరావు, ఎంపీఓ

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయడం జరిగింది. ఎండలు ఎక్కువగా ఉన్నందున చలివేంద్రాలు ప్రధాన సెంటర్ల వద్ద సిద్ధం చేశాం. అలాగే, స్వచ్ఛంద సంస్థల సహకారంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేసే ఆలోచనలు చేస్తున్నాం.

– తెల్లం వరలక్ష్మి, సర్పంచ్, పర్ణశాల

క్లుప్తంగా

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో క్రీడాకారులకు సోమవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు దేవరపు యాకమణి, శ్యామకూరి వినోద, దేవరపు శ్రీను, పాటి ప్రదీప్‌రెడ్డి, కమటం భాస్కర్, సిద్దు, బచ్చలకూరి వెంకట్ పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్రాంచ్ ప్రారంభం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) పీ.వీ.కాలనీ, సమితిసింగారం బ్రాంచ్‌ను సోమవారం అంబేడ్కర్ సెంటర్‌లో పునఃప్రారంభించారు. ఈసందర్భంగా రీజినల్ మేనేజర్ ఉదయ్, సీనియర్ మేనేజర్ జలందర్ నెహ్రూ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో బ్రాంచ్ ఏర్పాటు చేశామన్నారు. సమితి సింగారం, బండారుగూడెం బ్రాంచ్ మేనేజర్లు జి.మహేందర్, ప్రభాకర్‌తో పాటు క్యాషియర్ ఎం.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు



కిట్లు అందుకున్నవారితో డాక్టర్ దుర్గాభవాని, వైద్య సిబ్బంది

పినపాక: గర్భిణులు సరైన పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని పినపాక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యురాలు దుర్గాభవాని తెలిపారు. గర్భిణులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన న్యూట్రీషిన్ కిట్లను స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ఆమె అందజేసి మాట్లాడారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువు పరిధి భీమవరానికి చెందిన సప్కా సమ్మక్కకు రూ.15,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, సర్పంచ్ బండ్ల సంధ్యారాణితో పాటు వీరభద్రం, ఎస్.కే.నయీం, గడకారి రామకృష్ణ, వంకా పంతులు, జూపల్లి కిరణ్, జావీద్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

పినపాక: వచ్చే నెల 2న జరగనున్న మండలంలోని 11 పంచాయతీల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి కోరారు. ఈమేరకు రాళ్లవాగు వద్ద సమ్మేళనం ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతు కన్వీనర్ దొడ్డ శ్రీనివాస్‌రెడ్డితో పాటు కొండేరు రాము, చింతపంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌కు సీలింగ్ ఫ్యాన్లు



సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు: బూర్గంపాడులోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌కు మోరంపల్లిబంజరకు చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం రెండు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డితో పాటు చింతా అంకిరెడ్డి, ఇండ్ల వెంకటరాజేష్, సంకా సురేష్, బత్తుల రామకొండారెడ్డి, పేరం రాంరెడ్డి, ఆవుల నాగార్జున, బిజ్జం వెంకట్రావిరెడ్డి, పాలెం సంతోష్‌రెడ్డి, హెచ్ఎం నాగ మల్లేశ్వరి పాల్గొన్నారు.

‘ఆధార్’ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్‌లో సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ సెంటర్ సాంకేతిక సమస్యలతో ఆరు నెలలుగా తెరవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు భద్రాచలం, మణుగూరు వంటి పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, సమస్యను వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సులక్షణ తెలిపారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న యూత్ సభ్యులు

గుండాల: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యాన సోమవారం పరీక్ష కిట్లు అందజేశారు. ఈసందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం కిషన్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పరీక్షలు బాగా రాయాలని సూచించారు. ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, లాలయ్య, ఉపాధ్యాయులు శివ, జానీ, భుజంగరావు, వెంకటేష్, నర్సింహారావుతో పాటు శ్రీరంగం ప్రవీణ్, ముచ్చ ప్రదీప్, మాదాల అశోక్, నరేష్, శశి, కొండేటి సతీష్, ప్రణయ్, వాసం శివ, సిద్దు మాజోజు, వెంకటేష్, ఆజాద్ పాల్గొన్నారు.

గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యాన ..

భద్రాచలంటౌన్: పట్టణంలోని కస్తుర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యాన బత్తుల సాంబయ్య సోమవారం పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ.. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శ్రద్ధగా చదివి డివిజన్‌లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతి ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం సంపత్, పాఠశాల హెచ్ఎం లీలా, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, పార్వతి, స్వరూపారాణి, పూర్ణబాయి, శరణ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బూర్గంపాడు: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లోని హమాలీ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య డిమాండ్ చేశారు. సారపాకలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు కోసం మంగళవారం కలెక్టరేట్ ఎదుట జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని , ధర్నాకు సంబంధించిన పోస్టర్లను పంపిణీ చేశారు. నాయకులు గుంటక కృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సాయి, సాంబిరెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కంటివైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

మణుగూరు రూరల్ : మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన పలువురికి నేత్ర వైద్యాధికారి డాక్టర్ జి. సంజీవరావు పరీక్షలు చేశారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కింద ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతీ సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు శస్త్రచికిత్సలు చేస్తామని సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, డాక్టర్ సునీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామంలో వైద్యశిబిరం..



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన పెద్దపల్లిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే చేసి జ్వర పీడితుల రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, శైలజ, రోజా పాల్గొన్నారు.

సామూహిక యోగా

భద్రాచలం: పట్టణంలోని మదర్‌థెరిస్సా డిగ్రీ కళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో సామూహిక యోగా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ తోటమళ్ల వెంకటరమణ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచడానికి యోగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుతో పాటు సీతామహాలక్ష్మి, సుశీల, నిర్మల, సాయిదీప్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

చండ్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయతీ పరిధి సుంకరబంజర్‌లో భక్తాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు. ఈమేరకు నిర్మాణ పనులకు సోమవారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య భూమి పూజ చేయగా, నాయకులు నాగా సీతారాములు, జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఆతర్వాత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఎంపీపీ బానోత్ పార్వతి, బోజ్యానాయక్‌తో పాటు నరుకుళ్ల సత్యనారాయణ, చెవుల చందర్‌రావు, రాముడు, సంగొండి రాఘవులు, బన్నే రాము, చలపతిరావు, సీహెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్లు

మణుగూరు రూరల్: మణుగూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల దాఖలు గడువు ముగిసిందని ఎన్నికల అధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు అధ్యక్ష, కోశాధికారి పదవులకు పోటీ ఉండగా, ఉపాధ్యక్షులుగా చిర్రా సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా చిర్రా రవికుమార్, మహిళా ప్రతినిధిగా సావిత్రి, సహాయ కార్యదర్శిగా సర్వేశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. కాగా, అధ్యక్ష స్థానానికి మేదరమెట్ల శ్రీనివాసరావు, కె.నగేష్‌కుమార్, జాడి చొక్కారావు పోటీపడుతున్నారని, ఈనెల 30న ఎన్నికలు నిర్వహించి ఫలితం వెల్లడిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం



రామ్మోహన్‌రావు

భద్రాచలంటౌన్: పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు రాష్ట్రస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో బంగారు పతకం లభించింది. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో సిటీ స్టైల్ క్రీడాకారుడు గాలి రామ్మోహన్‌రావు 105 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను సోమవారం భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, కోచ్ జీ.వీ.రాంరెడ్డితో పాటు మల్లేష్, తిరుమలరావు, వసంతరావు, వీరారెడ్డి తదితరులు అభినందించారు.

శ్రీసీతారాముల కల్యాణ పనులు షురూ..



పసుపు దంచుతున్న మహిళా భక్తులు

మణుగూరు రూరల్ : మండలంలోని సమితి సింగారం కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ పనులను సోమవారం పసుపు దంచే వేడుకతో ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పవిత్ర గోదావరి జలాలు 108 బిందెలతో అభిషేకం చేస్తారు. అనంతరం రామయ్యను పెళ్లి కుమారుడిగా, సీతమ్మవారిని పెళ్లి కూతురుగా అలంకరిస్తారు. 30వ తేదీ ఉదయం 11.45 నిమిషాలకు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపిస్తారు. 31న శ్రీరాముని పట్టాభిషేకం, సాయంత్రం ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

కాలినడకన భద్రాచలానికి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెంకు చెందిన భక్తులు పలువురు సోమవారం కాలినడకన భద్రాచలం బయలుదేరారు. గ్రామానికి చెందిన యాదవ యువ సైన్యం ఆధ్వర్యాన 25 మంది ఈనెల 30 తేదీన జరిగే శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు పాదయాత్రగా వెళ్తున్నారు. గత ఎనిమిదేళ్ల నుంచి వెళ్తున్నామని భక్తులు పేరం నాగబాబు, కోటేశ్వరరావు, సాయికుమార్, వేముల సాయి, దుర్గారావు, కొర్రాజులు, వెంకటేశ్వరరావు తెలిపారు.

రాహుల్‌పై వేటు అప్రజాస్వామికం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అన్నపురెడ్డిపల్లి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు భీముడు ఆధ్వర్యాన నాయకులు మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు చల్లా రమేష్, ఇనపనూరి రాంబాబు, దోసపటి రాంబాబు, ముద్రగడ్డ వెంకటేశ్వర్లు, అజీం, సుభానీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు రాతపరీక్ష

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు చార్టర్ సేఫ్టీ ల్యాంప్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోగా, సోమవారం ఎంవీటీసీ కార్యాలయంలో రాత పరీక్ష నిర్వహించారు. ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్ పరీక్షను పర్యవేక్షించారు. కాగా, రెండు పోస్టులకు ఇద్దరే అభ్యర్థులు హాజరుకాగా, మౌఖిక పరీక్ష కూడా నిర్వహించామని తెలిపారు. ఏరియా అధికారులు వెంకటరమణ, నాగేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘సిండికేట్’పై చర్య తీసుకోండి

మణుగూరు రూరల్ : మణుగూరులో మద్యం సిండికేట్‌ను ఎత్తివేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గురిజాల గోపి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి సామన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. బెల్ట్ షాపులను, అధిక ధరలకు మద్యం విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బెల్ట్ షాపులు ఎత్తేయకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బూర్గుల మోహన్, కొడెం సాంబశివరావు, ఎండీ నూరుద్దీన్, ఎండి షరీఫ్, పాపారావు, మోహన్ పాల్గొన్నారు.

బాలకథకుడికి ఉత్తమ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బాల సాత్వికసాయి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన బాల కథకుడు సాత్విక్ సాయి కుమారాచార్యులుకు ఉగాది పురస్కారం దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా పొత్తూరు వద్ద ప్రముఖ సాహితీవేత్త గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఉగాది సంబురాల కార్యక్రమంలో ‘అపకారికి ఉపకారం’ కథకు గాను ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబుతో పాటు పొత్తూరి సుబ్బారావు, కూర చిదంబరం, రాఘవరెడ్డి, సయ్యద్ జానీపాషా, పొత్తూరు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాత్విక్‌సాయి కుమారాచార్యులను పలువురు అభినందించారు.

చిరు ధాన్యాలతో పోషకాహారం



మణుగూరుటౌన్: చిరుధాన్యాలతో ఏర్పాటుచేసిన ప్రదర్శన

మణుగూరుటౌన్/అన్నపురెడ్డిపల్లి/అశ్వారావుపేట రూరల్: చిరుధాన్యాలతో పౌష్టికాహారం అందుతుందనే విషయంపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని సీడీపీఓలు జయలక్ష్మి, నిర్మలాజ్యోతి సూచించారు. మణుగూరు మండలం సాంబాయిగూడెం సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రం–1, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పోషణ పక్వాడ్‌లో గర్భిణులు, బాలింతలకు వారు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాల్లో సర్పంచ్‌లు తిరుపతమ్మ, రాములు, సిబ్బంది పద్మ, టి.భద్రమ్మ, కె.నాగేశ్వరరావు, నందిని, రజిని, వెంకటలక్ష్మి, జ్యోతి, భవాని, విజయలక్ష్మి, రాణి, సర్పంచ్ రాములు, గంగాజలం తదితరులు పాల్గొన్నారు. ఇక అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి పీహెచ్‌సీలో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా డాక్టర్ మధులిక ఆధ్వర్యాన కిశోర బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, పద్మావతితో పాటు దుర్గ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: సామూహిక సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది



అశ్వారావుపేటరూరల్: కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు